క్లుప్తంగా

విద్యార్థుల రక్తదానం

పెడన: రక్తదానం చాలా గొప్పదని, రక్తదానం చేయడం వల్ల మరొకరి ప్రాణం నిలుస్తోందని శ్రీవాసవి ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్ కె. కుమార్‌బాబు అన్నారు. బుధవారం కళాశాలలో డాక్టర్ పట్టాభి రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో 58 మంది విద్యార్థులు రక్తాన్ని దానం చేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ డాక్టర్ టీఎస్ఎస్ బాలాజీ, కార్యదర్శి భవిరి శంకర్‌నాథ్, రమేష్, డాక్టర్ శివప్రసాద్, కళాశాల డైరెక్టర్ దొనపాటి బాబా, ప్రిన్సిపాల్ డాక్టర్ బీఆర్ఎస్ రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

రంగనాయక స్వామి పవిత్రోత్సవాలు ప్రారంభం

మచిలీపట్నంటౌన్: రాబర్ట్‌సన్‌పేటలోని భూనీల పరివార సమేత రంగనాయకస్వామి వారి దేవస్థానంలో స్వామి వారి పవిత్రోత్సవాలు బుధవారం రాత్రి వైభవంగా ప్రారంభమయ్యాయి. మొదటిరోజున ఆలయంలో సాయంత్రం 6.36 గంటలకు పూజాదికాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి కందుల వేణుగోపాలరావు పర్యవేక్షించారు.

43 మందికి ఉద్యోగాలు

మచిలీపట్నంటౌన్: జిల్లా ఉపాధి కార్యాలయం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం స్థానిక లేడియాంప్టిల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించారు. కళాశాలలో ఇంటర్మీడియట్ ఒకేషనల్ కోర్సు చదివిన 43 మంది యువతకు ఉద్యోగావకాశం లభించింది. మొత్తం 200 మంది నిరుద్యోగ యువత ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. ముఖ్య అతిథిగా ఇంటర్మీడియట్ ఒకేషనల్ కోర్సుల అధికారి బి. ప్రసాద్, జిల్లా ఉపాధి కార్యాలయ అధికారి దేవరపల్లి విక్టర్‌బాబు, జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ సందీప్, కళాశాల ప్రిన్సిపాల్ ఐ. ఆనంద్ పాల్గొన్నారు.

ఉర్దూ అభివృద్ధికి కృషి చేయండి

గూడూరు: ఉర్దూ పాఠశాలల్లో భాషాభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలని సమగ్ర శిక్ష స్టేట్ ఉర్దూ స్పెషల్ ఆఫీసర్ సయ్యద్ అబ్దుల్ ఘని అన్నారు. గూడూరులోని నగరంపేట ఉర్దూ పాఠశాలలో నిర్వహిస్తున్న స్కూల్ కాంప్లెక్స్ తరగతులను అబ్దుల్ ఘని బుధవారం పరిశీలించి పలు సూచనలు చేశారు.

వినాయకా.. సెలవిక



మంగినపూడిబీచ్‌లో గణనాథుడిని నిమజ్జనం చేస్తున్న భక్తులు



కోడూరులో గణనాథుడి కల్యాణంలో పాల్గొన్న దంపతులు

పెడన: వినాయక చవితి ఉత్సవాలు ముగింపునకు చేరుకున్నాయి. బుధవారం పలు ప్రాంతాల్లో వినాయకుడి ప్రతిమలను నిమజ్జనానికి తరలించారు. మండల పరిధిలోని నందమూరులో యువత ఏర్పాటు చేసిన వినాయకుని వద్ద లడ్డూకు వేలం నిర్వహించగా గ్రామానికి చెందిన పెరుమాళ్ల భాస్కర్ రూ.9,501లకు దక్కించుకున్నారు. మడక గ్రామంలో అన్నసమారాధన నిర్వహించారు. అనంతరం గణపతిని నిమజ్జనానికి తరలించారు. పెడన పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణనాథుల ప్రతిమలను ఊరేగింపుగా తీసుకువెళ్లి నిమజ్జనం చేశారు.

● **మచిలీపట్నంటౌన్:** నగరంలోని ప్రధాన కూడళ్లతో పాటు పలు కాలనీల్లోని గణనాథుల విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన వాహనాల్లో ఉంచి మంగినపూడి బీచ్, కాలువల వద్దకు తీసుకువెళ్లి నిమజ్జనం చేశారు. గణనాథుని విగ్రహాలను డీజే సౌండ్స్, మేళతాళాలు, తీన్‌మార్ డప్పువాయిద్యాల నడుమ భక్తులు ఉత్సాహంగా ముందుకు సాగారు. పలు పందిళ్ల వద్ద అన్నసమారాధన నిర్వహించారు.

● **కోనేరుసెంటర్:** బందరు మండలం మంగినపూడి బీచ్‌లో బుధవారం వినాయక నిమజ్జనాలు పెద్ద ఎత్తున జరిగాయి. తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించిన భక్తులు బుధవారం గణనాదుడికి బైబై చెప్పారు. పట్టణంతో పాటు పలు గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పందిళ్ల వద్ద కమిటీ నిర్వాహకులు గణనాథునికి ప్రత్యేక పూజల అనంతరం ఆయా ప్రాంతాల్లోని వీధుల్లో విగ్రహాలను ఊరేగిస్తూ మంగినపూడి బీచ్‌కు తరలివెళ్లారు. బీచ్ వద్ద విగ్రహాలకు హారతులు పట్టి సముద్రంలో నిమజ్జనాలు చేశారు. బందరు మండలంతో పాటు ఇతర ప్రాంతాల నుంచి విగ్రహాలు భారీగా తరలి రావడంతో సాయంత్రానికి మంగినపూడి బీచ్ భక్తుల రాకతో హోరెత్తింది. బందరు రూరల్ ఎస్ఐ చాణక్య, మెరైన్ ఎస్ఐ చంద్రబోస్, ఏఎస్ఐ మురళి తదితరులు బీచ్‌లో పటిష్ట బందోబస్తు నిర్వహించి ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు.

● **గూడూరు:** గూడూరులోని పంజా సెంటర్‌లో మంగళవారం గణపతి లడ్డూ వేలం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు మాగంటి నాగరాజు రూ.6,700 లడ్డూ దక్కించుకున్నారు. బుధవారం బొజ్జ గణపతిని కోలాహలంగా ఊరేగించి రామరాజుపాలెం కాలువలో నిమజ్జనం చేశారు.

● **బంటుమిల్లి:** స్థానిక ఆంధ్రా బ్యాంకు సెంటర్‌లో లక్ష్మీగణపతి మోటారు వర్కర్స్, ఓనర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గణేష్ పందిరి వద్ద ఏర్పాటు చేసిన అన్నసమారాధనలో భక్తులు వేలాదిగా పాల్గొన్నారు. విజయ గణపతి మోటారు సైకిల్ మెకానిక్ ఓనర్సు, వర్కర్లు వినాయకుని గుడి వద్ద నిలిపిన గణనాథుడిని గ్రామ వీధుల్లో ఊరేగించి బంటుమిల్లి ప్రధాన కాలువలో నిమజ్జనం చేశారు.

కనుల పండువగా గణనాథుడి కల్యాణం..

కోడూరు: స్థానిక ప్రసన్న గణపతి ఆలయం వద్ద సిద్ధి, బుద్ధి సమేత వినాయకుడి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ స్వామివార్లకు ఆలయ కమిటీ సభ్యులు పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం కల్యాణాన్ని కనుల పండువగా జరిపారు. యర్రారెడ్డివారిపాలెం రామాలయం వద్ద ఏర్పాటు చేసిన గణనాథుడి విగ్రహం వద్ద మూడు వేల మందికి అన్నసమారాధన నిర్వహించారు. నక్కవానిదారి, స్వతంత్రపురం మందిరాల వద్ద నాలుగు వేల మందికి అన్నసమారాధన జరిపారు. కోడూరు తూర్పు వైపు, ఇస్మాయిల్‌బేగ్‌పేట గ్రామాల్లో ఏర్పాటు చేసిన గణనాథుల విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు. డప్పువాయిద్యాలు, డీజే పాటల మధ్య యువకులు నందడి చేస్తూ విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు.

విధులను సమర్థంగా నిర్వర్తించండి

కోనేరుసెంటర్: స్టేషన్ బాధ్యతలు స్వీకరించనున్న ఎస్‌హెచ్‌ఓలు ఇతర సిబ్బంది విధులను సమర్థవంతంగా నిర్వర్తించి పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలని జిల్లా ఎస్పీ పి. జాషువా అన్నారు. జిల్లాలో ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా వివిధ స్టేషన్లలో బాధ్యతలు స్వీకరించిన పలువురు సీఐలు, ఎస్ఐలు బుధవారం ఎస్పీ జాషువాను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

శివరామకృష్ణ క్షేత్రానికి రూ.లక్ష విరాళం

కోడూరు: కోడూరులో నూతనంగా నిర్మిస్తున్న శివరామకృష్ణ క్షేత్రానికి కోడూరు తూర్పు వైపు గ్రామానికి చెందిన పూతబోయిన గోపాలరావు-అంజనీ లక్ష్మీ దంపతులు రూ.లక్ష నగదును బుధవారం కమిటీ సభ్యులకు అందించారు. పూర్తి గ్రానైట్‌తో నిర్మిస్తున్న ఆలయానికి తమ వంతు సహాయం అందించడం ఆనందంగా ఉందని గోపాలరావు దంపతులు తెలిపారు. కమిటీ సభ్యులు అన్నం వెంకట సుబ్బారావు, బూరగడ్డ హరినాథ్‌బాబు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచండి

మచిలీపట్నంటౌన్: నగరంలోని 33వ డివిజన్‌లో పారిశుద్ధ్యాన్ని మరింత మెరుగుపరచాలని మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ పారిశుద్ధ్య విభాగ అధికారులకు సూచించారు. బుధవారం ఉదయం 33వ డివిజన్‌లో ఆమె విస్తృతంగా పర్యటించారు. పారిశుద్ధ్య కార్మికులకు సంబంధించి హాజరుపట్టీలను పరిశీలించి లోపాలపై ప్రశ్నించారు. వర్షం కురిసినా నీరు పారేలా డ్రెయిన్లు ఉంటే ముంపు సమస్య తలెత్తదని, డ్రెయిన్ల పూడికతీతపై దృష్టి సారించాలని చెప్పారు. వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి శ్రీకాకోళపు నరసింహగుప్తా, వైఎస్సార్ సీపీ సచివాలయ కన్వీనర్ వేముల కృష్ణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అవనిగడ్డ సీఐగా రమేష్

అవనిగడ్డ: అవనిగడ్డ నూతన సీఐగా ఎల్. రమేష్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ సీఐగా పనిచేసిన శ్రీనివాస్‌ను వీఆర్‌లోకి పంపగా ఆయన స్థానంలో రమేష్ నియమితులయ్యారు. రమేష్ మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో శాంతిభద్రతలను పెంపొందించేందుకు, ట్రాఫిక్ నియంత్రకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ప్రజల దీవెనలతో మళ్లీ అధికారం

భీమిలి ఎమ్మెల్యే అవంతి శ్రీనివాస్

మోపిదేవి: రాష్ట్ర ప్రజల దీవెనలతో మరోసారి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అవుతారని భీమిలి ఎమ్మెల్యే అవంతి శ్రీనివాస్ అన్నారు. మోపిదేవి వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారిని బుధవారం దర్శించుకున్నారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడారు. జగనన్న ప్రభంజనంతో రానున్న ఎన్నికల్లో 175 నియోజకవర్గాల్లో వైఎస్సార్ సీపీ విజయం సాధిస్తుందన్నారు. కులమతాలు, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలను నాలుగేళ్లలో ఎక్కడా అవినీతి, వివక్షత లేకుండా అమలు చేశామని చెప్పారు. ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉన్నారని, మరోసారి జగనన్నే రావాలని, కావాలని కోరుకుంటున్నారని వివరించారు. లేనిపోని ఆరోపణలు ఎన్ని చేసినా, ఎన్ని పార్టీలు ఏకమైనా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సీఎం కావడం ఖాయన్నారు.

స్వామివారిని దర్శించుకున్న భీమిలి ఎమ్మెల్యే అవంతి

మోపిదేవి: స్థానిక వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారిని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి (అవంతి) శ్రీనివాస్ బుధవారం దర్శించుకున్నారు. తొలుత ఆలయ ప్రదక్షిణ చేసిన ఆయన నాగపుట్టలో పాలుపోసి మొక్కుబడి చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు బుద్దు సతీష్ శర్మ, బాలకృష్ణ శర్మ స్వామివారికి అభిషేకం నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ ఏసీ ఎస్ఎస్ చక్రధరరావు స్వామివారి చిత్రపటం, లడ్డూ ప్రసాదాలు అందించారు. ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



శ్రీనివాస్‌కు స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఆలయ ఏసీ చక్రధరరావు

జగనన్న ఆరోగ్య సురక్షకు పటిష్ట ఏర్పాట్లు

కలెక్టర్ రాజాబాబు

చిలకలపూడి(మచిలీపట్నం): ఈ నెల 30వ తేదీన ప్రారంభించనున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ పి. రాజాబాబు అన్నారు. బుధవారం ముఖ్యమంత్రి కార్యదర్శి పూనం మాలకొండయ్య, వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు, కమిషనర్ జె. నివాస్, ఆరోగ్యశ్రీ ట్రస్ట్ అదనపు సీఈఓ హరీంద్రప్రసాద్‌లు జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై పలు సూచనలు చేశారు. కలెక్టర్ రాజాబాబు ఆయన చాంబర్ నుంచి మాట్లాడుతూ మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష పైలెట్ కార్యక్రమాన్ని బంటుమిల్లి మండలం అర్తమూరు గ్రామంలో నిర్వహించామన్నారు. ఈ శిబిరానికి ప్రజలు పెద్ద ఎత్తున హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారని చెప్పారు. ఈ నెల 30వ తేదీ నుంచి నిర్వహించే ఈ కార్యక్రమానికి ప్రజలతో పాటు ప్రజాప్రతినిధులు కూడా పెద్దఎత్తున హాజరయ్యే అవకాశం ఉందన్నారు. అందుకు తగిన విధంగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. జిల్లాలో ఒక్కొక్క వైద్య శిబిరంలో నలుగురు వైద్యులతో పాటు రెండు బృందాలను ఏర్పాటు చేసి వైద్య పరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు. 40 శాతం మంది వృద్ధులకు కంటి డాక్టర్ కూడా అవసరం ఉంటుందన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఎంహెచ్ఓ జి. గీతాబాయి పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ రాజాబాబు

ఆదినారాయణ కుటుంబ సభ్యులకు మంత్రి పరామర్శ

పెడన: ఆదినారాయణ కుటుంబ సభ్యులను బుధవారం సాయంత్రం మంత్రి జోగి రమేష్, శకుంతలా దేవి దంపతులు కలిసి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ రాజులపాటి వాణి, అచ్యుతరావు, కొండవీటి నాగబాబు, గరికపాటి వెంకట రామానాయుడు, మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ ఖాజా, ఫ్లోర్ లీడర్ భళ్ల గంగయ్య పాల్గొన్నారు.

కొనసాగుతున్న గాలింపు చర్యలు..

కోడూరు: పెడన మండలానికి చెందిన మంత్రి జోగి రమేష్ వ్యక్తిగత ఫొటోగ్రాఫర్ యరగాని ఆదినారాయణ ఆచూకీ కోసం పోలీసులు, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు ముమ్మరంగా గాలింపు చేస్తున్నారు. ఆదినారాయణ ద్విచక్ర వాహనం ఉల్లిపాలెం-భవానీపురం వారధిపై ఉండడం, అందులో సూసైడ్ నోట్ లభ్యం కావడంతో ఆదినారాయణ కృష్ణానదిలో దూకి ఉంటాడనే అనుమానంతో నదిని పోలీసులు జల్లెడ పడుతున్నారు. బుధవారం మాచవరం నుంచి హంసల దీవి వరకు పోలీసులు, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు ఆరు బృందాలుగా విడిపోయి నదిలో గాలింపు చేపట్టారు. బుధవారం రాత్రి వరకు ఆదినారాయణ ఆచూకీ లభించలేదని ఎస్ఐ రాజేంద్రప్రసాద్ తెలిపారు.



ఆదినారాయణ కుటుంబసభ్యులకు ధైర్యం చెబుతున్న మంత్రి జోగి రమేష్ దంపతులు

● **మచిలీపట్నంటౌన్:** రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మచిలీపట్నానికి చెందిన రిటైర్డ్ ఎంఈఓ కారుమూరి రాజేంద్రప్రసాద్ నియమితులయ్యారు. ఈ నెల 24, 25 తేదీల్లో జరిగిన సంఘ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాల్లో ఎన్నిక నిర్వహించారు. రాష్ట్ర కార్యదర్శిగా సీహెచ్ ఆశీర్వాదం ఎన్నికయ్యారు. వీరిని పలువురు అభినందించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

మచిలీపట్నంటౌన్: రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ అండర్-15 పోటీలకు మచిలీపట్నం చిలకలపూడి మునిసిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు బి భవిష్ను, కె. పావని ఎంపికయ్యారు. వీరు అక్టోబర్‌లో నంద్యాల జిల్లా మహానందిలో జరిగే రాష్ట్ర స్థాయి బాల్ బాడ్మింటన్ పోటీల్లో పాల్గొననున్నారు. విద్యార్థులను పలువురు అభినందించారు.

● **ఘంటసాల(అవనిగడ్డ):** ఘంటసాల మండల పరిధి గోగినేనిపాలెం జెడ్పీ హైస్కూల్‌కు చెందిన 20 మంది విద్యార్థులు పలు విభాగాల్లో రాష్ట్ర స్థాయి ఆటల పోటీలకు ఎంపికయ్యారని హెచ్ఎం తమ్మన వేణుగోపాలరావు తెలిపారు. స్థానిక హైస్కూల్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. అండర్-17 బాలుర సాఫ్ట్‌బాల్‌లో కొడాలి హేమంత్, కట్టా సాంబశివరావు, బాలికల విభాగంలో కొక్కిలిగడ్డ ఐశ్వర్య, కట్టా శాంతి, గరికపూడి హాసిని, బేస్‌బాల్‌లో నందు దేవరాజు, గట్టు విరంజిని, లంకె తేజస్విని, అండర్ -14 సాఫ్ట్‌బాల్‌లో బాలుర విభాగంలో పెరుకూరి సూర్యప్రకాష్, మట్టా నాగచైతన్య, గరికముక్కు ఉమాశంకర్, బుర్రె ప్రదీప్, బాలికల సాఫ్ట్‌బాల్‌లో నందు లోకం లహరి, బొల్లా సాయిలక్ష్మీ ప్రసన్న, పెనుమత్స ప్రీతి, కొడాలి భవిజ్ఞ, కొడాలి దుర్గ, బాలుర బేస్‌బాల్‌లో అద్దంకి దినేష్, అద్దంకి యశ్వంత్‌కుమార్ ఎంపికయ్యారు.

● ఘంటసాల ఎంకేగాంధీ హైస్కూల్‌కు చెందిన ఏడుగురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని హెచ్ఎం శ్రీరంగవల్లి తెలిపారు. అండర్ -17 సాఫ్ట్‌బాల్ బాలికల విభాగంలో కె. పింకీ, డి. సాయిసిరి చందన, బేస్‌బాల్‌లో కె. షైన్లీ, అండర్ 14 బాలికల విభాగంలో వి. సురేఖ, జి. మౌనిక, బేస్‌బాల్‌లో డి. అఖిల, బి. హర్షిత ఎంపికయ్యారు.

● **నాగాయలంక:** స్థానిక జెడ్పీ హైస్కూల్‌కు చెందిన 14 మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని హెచ్ఎం వనమా రామకృష్ణ తెలిపారు. అండర్ -17 సాఫ్ట్‌బాల్ బాలికల విభాగంలో కన్నా పూజిత, వల్లభుని సుకన్య, రేవు హరీష్, పి. లీలశ్రీ, అద్దంకి జీవన, మేఘన, కె. బాలాజీ, బేస్‌బాల్‌లో ఎం. దివ్య, పి. ప్రిహాన్స్, బాలుర విభాగంలో బి. వినయ్, అండర్ 14 బేస్‌బాల్‌లో జి. హాసిని, టి. ఉమాలక్ష్మి, ఎస్. జ్యోతిరాణి, బాలుర విభాగంలో పి. జగన్ ఎంపికయ్యారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక

● **గూడూరు:** కర్నూలు జిల్లా మహానందిలో ఈనెల 30 నుంచి జరగనున్న 8వ ఆంధ్రప్రదేశ్ సబ్ జూనియర్ బాలబాలికల బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు గూడూరు మండలం రాయవరం జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడాకారులు ఎంపికయ్యారు. ఈనెల 26న కొండపల్లిలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించిన జిల్లా జట్టు ఎంపికలో రాయవరం హైస్కూల్ విద్యార్థులు సాలా వికాస్, నందం శ్రీ ఫణీంద్రలు సత్తా చాటి రాష్ట్రస్థాయి పోటీలకు కృష్ణా జిల్లాకు ప్రాతినిధ్యం వహించే అవకాశం లభించిందని పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఎం.ఎం.సౌజన్య తెలిపారు. క్రీడాకారులను, వారికి శిక్షణ ఇచ్చిన పీఈటీ గోవిందరాజులును రాయవరం పీఏసీఎస్ చైర్మన్ కోళ్ల వీర వెంకట బాలకృష్ణ అభినందించారు.

నగరంలో మిలాద్-ఉన్-నబీ శోభ



విద్యుత్ దీపాల అలంకరణలో టెక్యాలోని మసీదు



కోనేరుసెంటర్ సర్కిల్‌లో విద్యుత్ దీపాల శోభ

నేడు మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు, ర్యాలీ

మచిలీపట్నంటౌన్: మొహమ్మద్ ప్రవక్త జన్మదినమైన మిలాద్- ఉన్-నబీ పర్వదినాన్ని గురువారం ఆనందోత్సాహాలతో జరుపుకునేందుకు నగరంలోని ముస్లింలు ఏర్పాటు చేశారు. నగరంలోని మసీదులను, ప్రధాన రహదారులను రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. నగరం నడిబొడ్డున ఉన్న కోనేరు సెంటర్‌కు ఆకుపచ్చ రంగు లైట్లు ఏర్పాటు చేశారు. నాగపోతరావు సెంటర్ నుంచి చింతచెట్టు సెంటర్ వరకు పెద్దఎత్తున విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. కొత్త మసీదు సెంటర్‌ను ప్రత్యేకంగా అలంకరించారు. ప్రధాన రహదారిలోని సెంట్రల్ డివైడర్‌కు పచ్చని జెండాలు కట్టారు. నగరంలోని పలు మసీదులను రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. దీంతో నగరంలో మిలాద్- ఉన్-నబీ శోభ కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. మిలాద్-ఉన్-నబీ సందర్భంగా గురువారం సాయంత్రం 4 గంటలకు రాజుపేట కొత్త మసీదు సెంటర్ నుంచి ముస్లింల భారీ ర్యాలీ జరుగుతుందని వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జోనల్ ఇన్‌చార్జి షేక్ సలార్‌దాదా బుధవారం తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని), వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) తదితర నాయకులు హాజరవుతారని చెప్పారు.

సింహాద్రి కృష్ణప్రసాద్‌కు గోల్డ్‌మెడల్



అవార్డు అందుకుంటున్న కృష్ణప్రసాద్

అవనిగడ్డ: ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఛాయా చిత్ర పోటీల్లో నాగాయలంక ఫొటోగ్రాఫర్ సింహాద్రి కృష్ణ ప్రసాద్‌కు ప్రతిభా పురస్కార్, గోల్డ్ మెడల్ లభించింది. విజయవాడలో జరిగిన కార్యక్రమంలో సెర్ప్ సీఈఓ ఇంతియాజ్ చేతుల మీదుగా పురస్కారాన్ని కృష్ణప్రసాద్ అందుకున్నారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ క్రియేటివిటీ అండ్ కల్చరల్ కమిషన్ సహకారంతో ఫొటో గ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా (పీఏఐ), ఇండియా ఇంటర్నేషనల్ ఫొటోగ్రాఫిక్ కౌన్సిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో సింహాద్రి కృష్ణప్రసాద్ ఛాయా చిత్రం ది టర్న్ వైజాగ్ లవ్ వేవ్స్ (వైజాగ్ ప్రేమ తరంగాల మలుపు) నకు ప్రతిభా పురస్కారం, గోల్డ్‌మెడల్ లభించింది. కార్యక్రమంలో పీఏఐ అధ్యక్షుడు డాక్టర్ రమణ, ప్రధాన కార్యదర్శి టి. శ్రీనివాసరెడ్డి, రైతు నాయకుడు అక్కినేని భవానీప్రసాద్, గోళ్ల నారాయణరావు పాల్గొన్నారు.

లాభాల బాటలో ఆకులమన్నాడు సొసైటీ

గూడూరు: ఆకులమన్నాడు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం లాభాల బాటలో పయనిస్తోందని గూడూరు మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ షేక్ ఫైజుల్ రహ్మాన్ (మున్నా) అన్నారు. ఆకులమన్నాడు పీఏసీఎస్ మహాజన సభ చైర్మన్ జంపాన వెంకట పకీరు అధ్యక్షతన బుధవారం సొసైటీ ఆవరణలో నిర్వహించారు. మున్నా మాట్లాడుతూ 2022-23 ఆర్థిక సంవత్సరానికి సొసైటీ రూ.32 లక్షల లాభాలు గడించిందన్నారు. ఈ సందర్భంగా రైతులకు రూ.4.72 లక్షల డెవిడెండ్‌ను పంపిణీ చేశారు. ఎంపీటీసీ కోళ్ల లక్ష్మణరావు, ఆర్బీకే చైర్మన్ బీరం రాజా, డైరెక్టర్లు, సీఈఓ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

గూడూరు: మండలంలోని పోసినవారిపాలెం ఎంపీయూపీ పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని బుధవారం గూడూరు తహసీల్దార్ బి.విజయప్రసాద్ పరిశీలించారు. జగనన్న గోరుముద్ద మెనూ ప్రకారం బుధవారం వండిన ఆహార పదార్థాలను ఆయన రుచి చూశారు. ఈ సందర్భంగా ఆహారం ఎలా ఉంటుందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్ మాట్లాడుతూ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు సంతృప్తికరంగా ఉందన్నారు.

బందరులో భారీ వర్షం

జలమయమైన రహదారులు

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నంలో మంగళవారం రాత్రి భారీ వర్షం కురిసింది. ఆకాశం మేఘావృతమై ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురవడంతో నగరం తడిచి ముద్దయ్యింది. 6.5 సెంటీ మీటర్ల వర్షం కురిసింది. దీంతో నగరంలోని ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రహదారులు వర్షం నీటితో నిండాయి. ఉదయం కూడా వర్షం నీరు రోడ్లపై నిలిచి ఉండటంతో పాఠశాలలకు, ఆఫీసులకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులు, ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు.

ఉద్యోగుల రెగ్యులరైజేషన్ ఆమోదంపై హర్షం

మచిలీపట్నంటౌన్: రాష్ట్ర అసెంబ్లీలో కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజేషన్‌ను ఆమోదించడంపై ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఉల్లి కృష్ణ బుధవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిష్కరించడం హర్షణీయమన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రాష్ట్రంలోని కాంట్రాక్టు ఉద్యోగులందరూ రుణపడి ఉంటారన్నారు.